సాక్షి పల్నాడు

శనివారం । 9 । నవంబర్ । 2024



అభివృద్ధి పనుల పరిశీలన

చిలకలూరిపేట: పలు అభివృద్ధి పనులను నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పుల్లారావు, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ శుక్రవారం పరిశీలించారు.



అభివృద్ధిలో ప్రజలూ భాగస్వాములు

తెనాలిఅర్బన్: పట్టణాభివృద్ధిలో ప్రజలూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని 32వ వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు.



వినాయక గుడి పునఃప్రతిష్ఠ

ముప్పాళ్ళ: దమ్మాలపాడులో వినాయక గుడి పునఃప్రతిష్ఠ, నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా శుక్రవారం జరిగాయి. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబు పూజలు చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తల నియామకం



విడదల రజిని



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ మంత్రి విడదల రజినిని చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. గుంటూరు నగర డెప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమాండ్ బాబు)ను తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

రూ.10 లక్షల విలువైన అక్రమ ఎరువుల నిల్వల సీజ్

వినుకొండ (నూజెండ్ల) : అక్రమంగా నిల్వ ఉంచిన బయో ఉత్పత్తులను వ్యవసాయ శాఖ అధికారులు సీజ్ చేశారు. వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఎరువులను ఏడీఏ బోయపాటి రవిబాబుతోపాటు, వ్యవసాయ శాఖ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.10 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. విచారణ అనంతరం వ్యాపారుల లైసెన్సు కూడా రద్దు చేస్తామని తెలిపారు.

నేడు విజయవాడలో వలంటీర్ల ఆవేదన సదస్సు




లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడలో శనివారం ఆవేదన సదస్సు నిర్వహిస్తున్నట్టు అఖిల భారత యువజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి జిల్లాలోని వలంటీర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు వలంటీర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు దానిని నిలబెట్టుకోలేదని విమర్శించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ ఆవేదన సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొంటారని వివరించారు.

యార్డులో 41,224 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 37,450 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,224 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,200 నుంచి రూ. 17,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,623 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 5706 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 292 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1089 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 540 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 398 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు విడుదల చేశారు.

ట్రక్కు టమారం

- ట్రాక్టర్లకు ఫ్రీ నిబంధనతో ట్రక్కుల కొద్దీ ఇసుక తరలింపు
- తమ్ముళ్లకు కాసుల పంట కురిపిస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులు
- ట్రక్కు రూ.ఐదు వేల నుంచి రూ.ఏడు వేల వరకు విక్రయం
- ఏమీ చేయలేమంటూ చేతులెత్తేసిన పోలీసులు
- ట్రాక్టర్లతోనైనా అవసరమున్నంత వరకే అంటున్న తహసీల్దార్



అచ్చంపేట ప్రధానరహదారిలో ఇసుక ట్రాక్టర్

అచ్చంపేట: ఇసుక పాలసీలో స్పష్టత లోపించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ప్రజల అవసరాల నిమిత్తం ఎడ్లబండి, ట్రాక్టర్లపై ఉచితంగా ఇసుక తోలుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. గతంలోనూ ఎడ్లబండి ద్వారా తోలుకునేందుకు అనుమతిచ్చారు. అయితే ట్రాక్టర్లూ ఉచితంగా ఇసుక తోలుకోవచ్చనే ఉత్తర్వులు మాత్రం అక్రమార్కులకు వరంగా మారాయి. దీంతో చాలామంది ట్రక్కుల కొద్దీ ఇసుకను లోడ్ చేసుకుని బయట మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ట్రక్కు ఇసుకను రూ.ఐదు వేల నుంచి రూ.ఏడు వేల వరకు అమ్ముతున్నట్టు సమాచారం. కొందరు రహస్య స్థావరాల్లో భారీగా ఇసుకను డంప్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదంతా తెలిసినా పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా నేరుగా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. అక్రమార్కుల జేబులు నిండుతున్నాయి. ఎడ్లబండ్లకు అనుమతులిచ్చినట్లు ట్రాక్టర్ల ద్వారా కూడా ఇసుకను తోలుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వల్ల పట్టపగలే మెయిన్‌రోడ్డు నుంచి వందలాది ట్రాక్టర్లలో ఇసుక రవాణా అవుతోంది. అయినా అధికారులు ఏమీ చేయలేక ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

చెలరేగిపోతున్న తెలుగు తమ్ముళ్లు

తెలుగుతమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. ట్రాక్టర్ల ద్వారా భారీగా ఇసుకను తరలించుకుపోతున్నారు. రహస్య స్థావరాల్లో భారీగా డంప్ చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఇసుక ధరను నిర్ణయించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

ఇంకా ప్రారంభం కాని రీచ్‌లు

అచ్చంపేట మండలంలో 9 ఇసుక రీచ్‌లు ఉండగా వాటిలో నాలుగు రీచ్‌లకు అధికారులు అనుమతులిచ్చారు. ఇవి ఇంకా ప్రారంభం కాలేదు. ఈ రీచ్‌ల ద్వారా నదిలో నుంచి ఒడ్డుకు ఇసుకను డంప్ చేసి వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అంటే క్యూబిక్ మీటరు రూ.192కు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఒక ట్రాక్టరుకు 5 క్యూబిక్ మీటర్లు పడుతుంది. క్యూబిక్ మీటర్ ఒకటికి రూ.192లు చొప్పున 5 క్యూబిక్ మీటర్లకు రూ.960 ఆదాయం ప్రభుత్వానికి వస్తుంది. ట్రాక్టర్లకు ఉచితంగా తోలుకునే అవకాశం ఇవ్వడం వల్ల ప్రభుత్వం ఒక్కొక్క ట్రాక్టరు నుంచి రావాల్సిన రూ.960 ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది.

ఇసుక డంప్ చేస్తే చర్యలు



ట్రాక్టర్లకు ఉచితంగా ఇసుక తోలుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. తోలుకునేవారు ఇసుకను అమ్ముకుంటున్నారా అనేది మా పరిధిలో విషయం కాదు. ఇసుక ఎక్కడైనా డంప్ చేసినట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

– వెంకటప్రసాద్, సీఐ, అచ్చంపేట

అవసరానికి మించి తీసుకెళ్లరాదు



అనుమతులు పొందిన రీచ్‌లను వెంటనే తెరవాలని టెండరుదారులకు తెలియజేశాం. ట్రాక్టర్ల ద్వారానైనా అవసరానికి మించి ఇసుక తోలుకెళ్తే చర్యలు తీసుకుంటాం. ఇసుక తీసుకెళ్తున్న వారి నుంచి వివరణ తీసుకుంటాం. ఉచితంగా తోలుకుని బ్లాక్ మార్కెట్‌లో అమ్మినా, రహస్య స్థావరాలలో డంప్ చేసినా ఉపేక్షించేది లేదు.

– జి.శ్రీనివాసయాదవ్, తహసీల్దారు

నల్లబజారుకు పేదల బియ్యం

- రైస్ మిల్లుల్లో జోరుగా రీసైక్లింగ్
- తెలిసినా పట్టని పర్యవేక్షణాధికారులు
- కొన్ని మిల్లుల్లోనే మంత్రి తనిఖీలపై అనుమానాలు



సత్తెనపల్లిలోని ఓ మిల్లు నుంచి పీడీఎస్ బియ్యం లారీలో లోడ్ చేస్తున్న కార్మికులు

సత్తెనపల్లి: రేషన్ బియ్యం యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతోంది. రైస్ మిల్లుల్లో జోరుగు రీసైక్లింగ్ సాగుతోంది. అయినా జిల్లా అధికారులకు పట్టడం లేదు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం కొన్ని మిల్లుల్లో తనిఖీలు చేసి రేషన్ బియ్యం నిల్వలను గుర్తించడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని బయటపెట్టింది. మనోహర్ కొన్ని మిల్లులనే లక్ష్యంగా చేసుకోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం సత్తెనపల్లి నియోజకవర్గంలోని పలు మిల్లుల్లో తనిఖీలు చేపట్టిన మంత్రి మనోహర్ 2,771 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఓ మిల్లులో బిల్లులను దహనం చేయడాన్ని గుర్తించారు. పీడీఎస్ బియ్యానికి సంబంధించిన ఖాళీ గన్నీ బ్యాగులు 3,200 లభ్యమయ్యాయి. రెండు మిల్లులను సీజ్ చేసి 6ఏ కేసుతోపాటు క్రిమినల్ కేసులూ నమోదు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో రైస్‌మిల్లుల్లో అక్రమాలు జరుగుతున్నా.. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు నెలలుగా రేషన్ బియ్యం రీసైక్లింగ్ జోరుగా జరుగుతున్నా.. పర్యవేక్షణ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో కొరవడిన నిఘా..

భారీగా పీడీఎస్ బియ్యం పట్టుబడడానికి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడమే కారణంగా కనిపిస్తోంది. ఎండీయూ వాహనాల సిబ్బంది, రేషన్ డీలర్లు కుమ్మక్కై, రేషన్‌కార్డుదారుల నుంచి బియ్యం కొని రైస్ మిల్లులకు తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ బియ్యాన్ని రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి బయట మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

నాదెండ్ల వ్యూహమేమిటో..!

మంత్రి నాదెండ్ల రైస్‌మిల్లుల తనిఖీల వెనుక అసలు వ్యూహం ఏమిటనేదానిపై చర్చ నడుస్తోంది. తనిఖీల సమాచారం తెలియగానే చాలా రైస్ మిల్లులకు తాళాలు వేస్తే కేవలం అచ్చంపేట రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లు తాళాలు పగలగొట్టి మరీ మంత్రి తనిఖీలు జరిపారు. మరికొన్ని మిల్లుల్లోనూ నిల్వలు ఉన్నా.. వాటి వైపు తొంగి చూడలేదు. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

1,075 రైస్ బ్యాగులు స్వాధీనం చేసుకున్న డీఎస్‌వో



అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డీఎస్‌వో కోమలి పద్మ

ప్రత్తిపాడు: రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం ఐదో మైలులోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా భారీ ఎత్తున రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారం శుక్రవారం రాత్రి గుంటూరు డీఎస్‌వోకు అందింది. దీంతో డీఎస్‌వో కోమలి పద్మ సిబ్బందితో కలిసి రైస్‌మిల్లుపై దాడి చేశారు. 1,075 రైస్ బ్యాగుల్లో నిల్వ చేసిన సుమారు 50 టన్నుల బియ్యంను డీఎస్‌వో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిల్వ చేసిన వారితోపాటు రైస్ మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రతి ఇంటికీ సౌర విద్యుత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై జేసీ సూరజ్ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ వినియోగించుకునేలా వినియోగదారులను చైతన్యపరచాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పీఎం సూర్యఘర్ యోజనపై జాయింట్ కలెక్టర్ సూరజ్‌తో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. గృహనిర్మాణం, టిడ్కో, పంచాయతీరాజ్, మున్సిపాలిటీల సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని అందరికీ వర్తింపజేయాలని సూచించారు. గృహనిర్మాణ, టిడ్కో పథక లబ్ధిదారులకు ఈ పథకంపై అవగాహన కల్పించి తమ ఇళ్లకు సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా దృష్టి సారించి వినియోగదారులను చైతన్యపర్చాలని తెలిపారు. నిర్వాహణ లోపాలు లేకుండా సేవలు అందించాలన్నారు. లబ్ధిదారులకు సబ్సిడీ వీలైనంత వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్

- ముగ్గురిని అరెస్ట్ చేసిన నరసరావుపేట రూరల్ పోలీసులు
- 29 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠాను నరసరావుపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.15.70 లక్షల విలువైన 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ కె.నాగేశ్వరరావు మీడియా సమావేశంలో కేసు వివరాలను తెలియజేశారు. నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన షేక్ ముల్లా మస్తాన్ బాజీ, నరసరావుపేట పట్టణంలోని పెదచెరువుకు చెందిన షేక్ ఖాజా జిలాని, పట్టణంలోని మిట్టబజార్‌కు చెందిన షేక్ జిలాని, నరసరావుపేట మండలం యల్లమంద పంచాయతీ పరిధిలోని శ్రీనివాసగిరిజన కాలనీకి చెందిన మినీగ రాజేష్, షేక్ టిక్కాలు ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నారు. నరసరావుపేట పట్టణంతోపాటు సమీప గ్రామాల్లో ఇళ్ల ముందు, హోటల్, బార్‌ల వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాల చోరీకి ఈ ముఠా పాల్పడుతోంది. లింగంగుంట్ల బ్యాంక్ కాలనీకి చెందిన బోర్ల మస్తాన్‌రావు తన ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం సెప్టెంబర్ 20న అపహరణకు గురైంది. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్‌ఆర్‌కేటీ కాలనీ బైపాస్ జంక్షన్ వద్ద ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. వీరి వద్ద నుంచి 18 ద్విచక్ర వాహనాలు, 11 స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15.70 లక్షలు ఉంటుందని డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంలో ప్రతిభ చూపించిన రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐలు సీహెచ్ కిషోర్, లేఖాప్రియాంక, దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు రివార్డు ప్రకటించినట్టు వెల్లడించారు. చోరీల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని డీఎస్పీ కోరారు. నంబర్ సిస్టమ్‌తో పనిచేసే లాక్‌లను ద్విచక్ర వాహనాలకు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తే సీసీ కెమెరా ఏర్పాటు చేస్తారని తెలిపారు. అలాగే నకిలీలపై పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రికి 73 పోస్టులు మంజూరు

గుంటూరు మెడికల్: మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు 73 మంజూరు చేస్తూ శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో 30 పడకలు మాత్రమే ఉండగా, వాటిని వందకు పెంచుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. పెంచిన పడకలకు అనుగుణంగా సుమారు రూ.56 కోట్లతో వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఏరియా ఆస్పత్రిగా మంగళగిరి ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

క్రీడా సంబరం



సత్తెనపల్లిలో ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న బాలురు

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం
- 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లు
- క్రీడాకారులతో సత్తెనపల్లి, నందిగామలో సందడి వాతావరణం
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లిలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాలురకు, సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో బాలికలకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లు హాజరయ్యాయి. ముందుగా సత్తెనపల్లి శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు ఫుట్‌బాల్ అందించారు. క్రీడాకారులతో కరచాలనం చేసి పోటీలు ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. అనంతరం క్రీడాకారులు పలు విన్యాసాలను ప్రదర్శించారు. పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు 26 హాజరుకాగా 470 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర టోర్నమెంట్ పరిశీలకులు పి.ప్రభాకరరావు, ఇంటర్ విద్య ఆర్ఐవో జుబేర్, డీవీఈవో జె.పద్మ, డీఐఈవో ఎన్.నీలావతి, ప్రగతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, పరిటాల నరేష్, రాయపాటి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, ఫిజికల్ డైరెక్టర్‌లు ఎస్.సుధాకర్‌రెడ్డి, పి.శివరామకృష్ణ, లాకు పిచ్చయ్య, అనీల్ దత్తనాయక్, సత్యవతి, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాలుర లీగ్ మ్యాచ్ ఫలితాలు

బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై విజయనగరం జిల్లా జట్టు 1-0 గోల్స్ తేడాతో, తూర్పుగోదావరి జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు 1-0 గోల్స్ తేడాతో, నెల్లూరు జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. కాగా విశాఖపట్నం జిల్లా- కృష్ణాజిల్లా జట్ల మ్యాచ్ 0-0 గోల్స్‌తో, శ్రీకాకుళం జిల్లా జట్టు - ప్రకాశం జిల్లా జట్టు మ్యాచ్ 0-0 గోల్స్‌తో డ్రాగా ముగిశాయి.

బాలికల లీగ్ మ్యాచ్ ఫలితాలు



తలపడుతున్న బాలికలు

పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. శుక్రవారం లీగ్ పోటీలు నిర్వహించగా విజేతల జట్లు క్వార్టర్స్, సెమీస్,ఫైనల్ పోటీల్లో తలపడతారు. మరో రెండు రోజులు పోటీలు జరగనున్నాయి. తొలిరోజు బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు 3-0 గోల్స్ తేడాతో, నెల్లూరు జిల్లా జట్టుపై విశాఖపట్నం జిల్లా జట్టు 6-0 గోల్స్ తేడాతో, కర్నూలు జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జిల్లా జట్టు 1-0 గోల్స్ తేడాతో గెలిచాయి. నెల్లూరు జిల్లా జట్టుపై జరిగిన మరొక మ్యాచ్‌లో చిత్తూరు జిల్లా జట్టు 5-0 గోల్స్ తేడాతో, కృష్ణా జిల్లా జట్టుపై మరో మ్యాచ్‌లో విశాఖపట్నం జిల్లా జట్టు 3-0 గోల్స్ తేడాతో, తూర్పుగోదావరి జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 10- 0 గోల్స్ తేడాతో, కర్నూలు జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 4-0 గోల్స్ తేడాతో విజయం సాధించాయి.

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

- ఒకరు 150 చోరీ కేసుల్లో నిందితుడు
- రూ.10 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని 150 చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగ తోట శివనాగేశ్వరరావు, అతడికి సహకరిస్తున్న ఇమిడి నాగేశ్వరరరావును అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 10 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. తోట శివనాగేశ్వరరావు, ఇమిడి నాగేశ్వరరావు తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి ముందుగా రెక్కీ నిర్వహించి చాకచక్యంగా చోరీలు చేయడంలో దిట్టలు. వీరు గతంలో జైలుకెళ్లి వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారు. వీరిని పట్టుకునేందుకు రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎస్ వెంకట్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. శుక్రవారం వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వారి వద్ద నుంచి రూ 10 లక్షల విలువైన 90 గ్రాముల బంగారం, 2.50 కేజీల వెండి, రెండు గోల్డ్ కవరింగ్ రిస్ట్ వాచెస్, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు చోరీలకు ఉపయోగించే నాలుగు ఇనుప రాడ్లు, ఒక స్క్రూడైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఆధార్ లింక్ కోసం ప్రత్యేక క్యాంప్

పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి



నరసరావుపేటటౌన్: ప్రీమియం ఖాతాలకు ఆధార్ లింక్ చేయడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి తెలిపారు. డివిజినల్ పోస్టల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలచ స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా కొత్త ప్రీమియం ఖాతాలను ప్రారంభం చేస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఖాతాలకు ఆధార్ లింక్ చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డీబీటీ పొందే లబ్ధిదారులకు ఐపీపీబీ ప్రీమియం ఖాతా తప్పనిసరి అన్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ చేయటం, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్‌ను సులభతరం చేయటం క్యాంపు యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్ర బౌలర్లు విజృంభణ

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కుచ్ బెహరా ట్రోఫీలో ఆంధ్రజట్టు తన ఆధిపత్యాన్ని చాటింది. 615 పరుగుల భారీ స్కోర్‌తో డిక్లేర్ చేసిన ఆ జట్టు.. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌పై బౌలింగ్‌లోనూ రాణించింది. మూడవ రోజు శుక్రవారం ఓవర్‌నైట్ స్కోర్ 50 పరుగులతో బ్యాటింగ్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు ఆంధ్ర బౌలర్ల ధాటికి 60.4 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు బి.యశ్వంత్, ఏఎస్ఎస్ లోహిత్‌లు చెలరేగి చెరో నాలుగు వికెట్లు తీశారు. హిమాచల్ ప్రదేశ్ బ్యాటర్ ఆరిృత్‌సింగ్ మాత్రమే రాణించి 52 పరుగులు సాధించాడు, అనంతరం రెండవ ఇన్నింగ్స్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 52 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది.

విద్యార్థులు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న లావు రత్తయ్య



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

- విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- ఉత్సాహంగా జిల్లా యూత్ ఫెస్టివల్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చేబ్రోలు: చిన్న వయసు నుంచే విద్యార్థులు ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే ఇతివృత్తంతో కార్యక్రమం ఏర్పాటైంది. వివిధ కళాశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా సెట్ప్ సీఈవో టీవీ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముందుగా లావు రత్తయ్య, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ జ్యోతి ప్రజ్వలనతో యువజనోత్సవాలను ప్రారంభించారు. అనంతరం లావు రత్తయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకమైన పాలసీ తీసుకురావాలన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, సెట్ప్ మేనేజర్ బి.రాధిక, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన వారి వివరాలను సెట్ప్ సీఈవో టీవీ విజయలక్ష్మి వెల్లడించారు. గ్రూపు ఫోక్ డ్యాన్స్‌లో జేకేసీ కళాశాల, హిందూ కళాశాల తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఫోక్ డ్యాన్స్ సోలోలో జి.ఆర్షిత, ఎం. త్రివేణి, గ్రూపులో జేకేసీ కళాశాల, విజ్ఞాన్ ధ్వని.. ఫోక్ సాంగ్ సోలో విభాగంలో హిమజ, వి.కీర్తి, కథా రచనలో టి శ్రీవల్లి, షేక్ లీనా రుష్వానా, కవిత్వంలో ఎం.ఓజస్వీ, జి శ్రీనిఖి, చిత్రలేఖనంలో రోహిత్ కుమార్, నిహాల్ కుమార్, ప్రసంగంలో ఎం. ఓజస్వీ, ఎం.పవన్‌లు, విజ్ఞానం - సాంకేతికత ప్రాజెక్ట్‌లో జి.రేణుక, బి.కీర్తనలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహం

- నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు ముందుకురావాలి
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



ఎంఓయూలు మార్చుకుంటున్న కంపెనీల ప్రతినిధులు

తాడికొండ: సమాజానికి దోహదపడే నూతన ఆవిష్కరణలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వికసిత్ భారత్ కింద దేశంలో స్టార్టప్‌లకు గొప్ప అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అమరావతిలోని విట్ (వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన వికాస్ – 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పెమ్మసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో అతి తక్కువ సంఖ్యలో స్టార్టప్‌లు ఉండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు ఉన్నాయన్నారు. గతంలో యూనికార్న్‌లు నాలుగు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 1,100కు అవి చేరాయని వివరించారు. ఇండియాలో సుస్థిరమైన ప్రగతి కోసం వికసిత్ భారత్, వికాస్ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. తాను నిర్వహిస్తున్న కమ్యూనికేషన్స్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తానని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చించిన మంత్రి పెమ్మసాని.. వర్సిటీ విద్యార్థులతో మాట్లాడారు. స్టార్టప్స్‌పై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ జి.విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వైస్ చాన్స్‌లర్ ఎస్.వి.కోటా రెడ్డి, రిజిస్టర్ జగదీష్, సి. ముదిగంటి తదితరులు పాల్గొన్నారు.

12న సత్తెనపల్లిలో జాబ్‌మేళా

సత్తెనపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కీల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ వారి ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ డ్రైవ్ జరుగుతుందన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జోసియల్ ప్రైవేట్ లిమిటెడ్, అక్రో సాఫ్ట్ సొల్యూషన్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతాయన్నారు. వేతనం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.14 వేల నుంచి రూ. 30 వేల వరకు ఉండవచ్చునన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసి, పీజీ విభాగం వరకు విద్యనభ్యసించి, 18–40 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు వారి బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోల తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కాగలరన్నారు. ఔత్సాహిక యువతీ, యువకులు ముందుగా http://naipunyam.ap.gov.in/ అనే వెబ్‌సైట్ నందు రిజిస్టర్ చేసుకోగలరన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనటువంటి యువతీ, యువకులు జాబ్ డ్రైవ్ జరుగు ప్రదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. ఇతర వివరాలకు రామకృష్ణారెడ్డి- 80743 93466, అంజిరెడ్డి-9494986164 సంప్రదించాల న్నారు. ఈ జాబ్‌డ్రైవ్‌ను సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంత యువతీ, యువకులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రైతుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే



తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలు పరిష్కరించడానికి గ్రీవెన్స్ డే తోడ్పడుతుందని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ అన్నారు. శుక్రవారం తుళ్ళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో అర్జీలు స్వీకరించారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండటంతో వెంటనే సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 – మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. శుక్రవారం భూ వ్యవహారాలకు సంబంధించి 49 సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు కె. స్వర్ణమేరి, బి. సాయి శ్రీనివాస్ నాయక్, లాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి. రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

అమరావతి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీ సమీపంలో శుక్రవారం కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఎం.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను, రెండు కోళ్లను, కోళ్లకాళ్లకు కట్టే ఇరవై కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 1,02,200 రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

శింగరకొండ హుండీ ఆదాయం రూ.37.41 లక్షలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను శుక్రవారం దేవస్థాన ఆవరణలో లెక్కించారు. నాలుగు నెలలకు రూ. 37.41 లక్షలు, 32 డాలర్లు వచ్చినట్లు దేవస్థాన ఏసీ ఎం.తిమ్మనాయుడు తెలిపారు. కార్యక్రమాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: బహిరంగ ప్రదేశాల్లో చేబ్రోలు మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లాలో శుక్రవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో జిల్లాలో ఇలా తాగిన 2,231 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 80 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చామని, కేసులు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందుబాబుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌లు 100, 112 లను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు



వేటపాలెం: బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీ నారాయణ స్వామి శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అండర్ – 14 విభాగంలో రహీమ్, అజయ్ కుమార్‌లు సత్తా చాటారన్నారు. పిట్టువారిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులను పీడీ కే మమత, విజయకుమార్, దుర్గావరప్రసాద్, సిబ్బంది అభినందించారు.

భారీగా బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: నాటుసారా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నగరం ఎక్సైజ్ సీఐ రాం ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ అదవల గ్రామ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించామన్నారు. నాటు సారా తయారీకి వినియోగించే 1500 లీటర్ల బెల్లం ఊటతోపాటు రెండు బట్టీలు గుర్తించి, ధ్వంసం చేసినట్లు తెలిపారు. తయారీదారులకు నల్లబెల్లం అమ్మే వారిపై చర్యలు తప్పవని తెలిపారు. సిబ్బంది వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



వేటపాలెం: జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పీడీ జరుబుల శ్రావణి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఫణి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ గేమ్స్‌లో జిల్లా నుంచి వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పీడీ ప్రతిభ చాటారన్నారు. తద్వారా జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేటపాలెం: రోడ్డు పక్కన ఆపి ఉన్న వాహనాన్ని వెనక వైపు నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారిలోని పందిళ్లపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. చల్లారెడ్డిపాలెం పంచాయతీ తానా కాలనీలో నివాసం ఉండే పీ వెంకటేశ్వర్లు (55) కడవకుదురు వెళ్లి బైక్‌పై కాలనీకి వస్తున్నాడు. అదే సమయంలో పందిళ్లపల్లి చెక్ పోస్టు వద్ద పక్కన ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని అదుపు తప్పి వెనక వైపు బలంగా ఢీకొట్టాడు. వెంకటేశ్వర్లు కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధి నిర్వహణకు వచ్చి.. విగతజీవిగా మారి!

- కొమెరపూడిలో రేషన్ బియ్యం పంచనామాకు హాజరైన చిలకలూరిపేట సీఎస్‌డీటీ లక్ష్మణరావుకు గుండెపోటు
- మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలింపు



సత్తెనపల్లి: విధి నిర్వహణకు వచ్చిన ఉద్యోగి విగత జీవిగా మారిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం అందుకున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కొమెరపూడిలోని రైస్‌మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పంచనామా చేసేందుకు చిలకలూరిపేటకు చెందిన పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వై.లక్ష్మణరావు (52) హాజరయ్యారు. శుక్రవారం లక్ష్మణరావు విధులు నిర్వహిస్తుండగా గుండె నొప్పి రావడంతో హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించే క్రమంలో మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. 20 ఏళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావు ఏడాది నుంచి చిలకలూరిపేటలో పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన మృతదేహాన్ని సత్తెనపల్లి ఆర్డీవో గాజులపల్లి వెంకట రమాకాంతరెడ్డి, సత్తెనపల్లి, చిలకలూరిపేట తహసీల్దార్‌లు కేఎస్ చక్రవర్తి, హుస్సేన్, జిల్లాలోని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది, సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సమాచారాన్ని తెలియజేసి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మార్కెట్లో ప్రకృతి ఉత్పత్తులకు అధిక ధర

జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి కె.అమలకుమారి



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ రైతులు పీజీఎస్ గ్రూప్‌లుగా ఏర్పడటం వల్ల పంట ఉత్పత్తులకు 15 శాతం అధిక ధర లభిస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి బాల సుబ్రహ్మణ్యం, అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 39,113 ఎకరాలలో 30 రకాల విత్తనాలు వేసి కొంత మేర పశుగ్రాసంగా, కొంత ఇంటి అవసరాలకు వినియోగించకోగా మిగిలినది భూమిలో కలియదున్నడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతులను పీజీఎస్ గ్రూప్‌లుగా ఈ ఏడాది ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు మొదటి రెండు సంవత్సరాలు స్కాప్ సర్టిఫికెట్, మూడవ సంవత్సరం ఆర్గానిక్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పట్టు పరిశ్రమ అధికారి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో పట్టుపురుగుల పెంపకం చేపట్టే ప్రతి రైతుకు రూ.50 వేలు నంచి రూ.3 లక్షల ఆదాయం లభిస్తుందని తెలిపారు. మలబరి తోట పెంపకానికి ఎకరానికి 30 వేలు, షెడ్ నిర్మాణానికి రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం లభిస్తుందని వివరించారు.

విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలి

డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్

నరసరావుపేట రూరల్: విద్యుత్ ట్రూ అప్ చార్జెస్ పేరుతో ప్రజలపై భారం మోపే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల భారాన్ని అన్యాయంగా ప్రజలపై మోపడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తే ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీలను విస్మరిస్తూ విద్యుత్ ట్రూ అప్ చార్జెస్ పేరుతో ప్రజలపై రూ.6 వేల కోట్ల భారం వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. దీపం పథకం ద్వారా రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, మరో చేత్తో వేల కోట్లు ప్రజల నుంచి వసూళ్లు చూసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. మాయమాటలతో ప్రజల జేబులకు చిల్లులు పెట్టే చర్యలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ట్రూ ఆప్ చార్జీలను విరమించుకోకపోతే విద్యుత్ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.రాధాకృష్ణ, భవాని, అనిల్, చుక్కా చంద్రపాల్, వేదాద్రి, ఆరీఫ్, బోయపాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కోతలు పెరిగాయి

ఎస్సీ కాలనీవాసులు ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

పెదకూరపాడు: నియోజకవర్గంలో అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. విద్యుత్ లైనుల మరమ్మతుల పేరుతో, సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపాల పేరుతో నిత్యం అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నిర్వహించిన ప్రజావేదికలో అత్యధిక ఫిర్యాదుల అందినప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ప్రతినిత్యం విద్యుత్ సరఫరాను అర్ధగంట పాటు నిలిపి వేస్తున్నారు. పెదకూరపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిపరమైన సమస్యలంటూ ఉదయం 8:30 నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పెదకూరపాడులోని ఎస్సీ కాలనీలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో కాలచక్రా రహదారిపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడం, కూటమి ప్రభుత్వంలో నిరంతరం విద్యుత్ కోత ఉండటంతో శాశ్వత పరిష్కారం చూపాలంటూ కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. గంటపాటు ధర్నా నిర్వహించిన ఎస్సీ కాలనీ వాసులు తక్షణం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో కాలచక్రం రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.

గ్రామీణులకు ఉపయోగపడేలా ప్రణాళికలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సూచన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చేలా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపకల్పనపై గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. దేశంలో 70 శాతం మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివశిస్తున్నారని తెలిపారు. గ్రామాల నుంచి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని చాలామంది ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారని అన్నారు. గ్రామాలను అభివృద్ధి పర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పంచాయతీ వనరుల కేంద్ర జిల్లా సమన్వయకర్త షీలా పద్మారాణి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తారని తెలిపారు. జనవరి నెలలో గ్రామస్థాయి, ఫిబ్రవరిలో మండల స్థాయి, మార్చి నెలలో జిల్లాస్థాయిలో ప్రణాళికల ద్వారా నిర్దేశించిన కార్యక్రమాలను పూర్తి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో నాగసాయికుమార్, జేడీ ఆర్. కేశవరెడ్డి, జెడ్పీ సీఈవో బి. జ్యోతిబసు, డాక్టర్ మోహన్, కె. జియాబేగం, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



నారాయణ మృతదేహం

అద్దంకి రూరల్: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. తేలుకుట్ల నారాయణ (27) ప్రకాశం జిల్లా మండ్లమూరు మండలం భట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం అద్దంకిలోని తన మిత్రులతో కలిసి గుండ్లకమ్మ నదిలో ఈతకు వచ్చాడు. నది ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. మిత్రులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ, సిబ్బంది వచ్చి గురువారం సాయంత్రం నుంచి గాలించినా ఆచూకీ తెలియలేదు. శుక్రవారం ఉదయం నుంచి ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బోట్లపై తిరుగుతూ గాలించారు. నారాయణ మృతదేహాన్ని గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నారాయణకు భార్య, ఒక పాప ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భంతో ఉన్నారు. నారాయణ మరణ వార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.